

# నత్తకే నడక నేర్పేలా..

- ఏడు నెలలుగా నిలిచిన రోడ్డు విస్తరణ పనులు
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన
- అవే పనులకు మరోసారి శంకుస్థాపన చేసిన కాంగ్రెస్ నాయకులు
- ప్రమాదకరంగా మారిన గుంతలు



రోడ్డు పక్కన తీసిన గుంతలు

బిచ్కుంద, జూన్ 8: మండల కేంద్రం బిచ్కుందలో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆగస్టు 27, 2023లో అనుమతులను జారీ చేసింది. అప్పటి జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే రెండు కిలోమీటర్ల మేర పనులు చేపట్టేందుకు రూ.12కోట్లు మంజూరు చేయించారు. రోడ్డు విస్తరణ పనులకు ఎనిమిది నెలల క్రితం హన్మంత్‌షిండే స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎన్నికలకు ముందు ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు పనులను ప్రారంభించారు. గుంతలు తీసి వదిలేశారు. పనులు చేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాయి. జుక్కల్ ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతారావు పనుల విషయమై అధికారులతో మాట్లాడారు. కొత్తగా టెండర్లు ఆహ్వానించాలని ఆదేశించారు. అవే పనులకు మార్చి 11న మరోసారి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శంకుస్థాపన చేశారు. మూడు నెలలు గడుస్తున్నా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులను త్వరగా చేయించాల్సి ఉండగా.. వాటికే శంకుస్థాపన చేయడంపై ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

**గుంతలతో ప్రమాదాలు..**

రోడ్డు విస్తరణ చేపట్టడం కోసం కాంట్రాక్టర్ గుంతలను తవ్వి వదిలేశారు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చిరుజల్లులు కురిసినా.. నీళ్లు వ్యాపార సముదాయాల్లోకి వెళ్తున్నాయి. పరిస్థితి ఇలా ఉంటే తాము వ్యాపారం ఎలా చేసుకోవాలని దుకాణాదారులు వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువలు కూడా లేకపోవడంతో మురికి నీరంతా ఇండ్లలోకి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానకాలం ప్రారంభానికి ముందే డ్రైనేజీలు నిర్మించాలని ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా.. ఫలితం లేకుండా పోయిందని, వారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డుపై మోకాలు లోతు వరకు నీళ్లు నిలిచి ఉన్నాయని తెలిపారు. వృద్ధులు, చిన్న పిల్లలు పడే ప్రమాదం ఉన్నదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని పనులు త్వరగా పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

**అగ్రిమెంట్ కాలేదు..**

ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ వినోద్‌ను వివరణ కోరగా.. కొత్త కాంట్రాక్టర్ ద్వారా అగ్రిమెంట్ కాలేదని తెలిపారు. ఎమ్మెల్యే పనులను ప్రారంభించారని, కొత్త కాంట్రాక్టర్ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో తనకు తెలియదని చెప్పారు.



ప్రారంభించిన పనులకే మరోసారి శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## తెలంగాణ తిరుమలలో పోచారం పూజలు

నస్రుల్లాబాద్, జూన్ 8: బీర్కూర్ శివారులో ఉన్న తెలంగాణ తిరుమల దేవస్థానాన్ని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనవెంట ఆలయ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు ఉన్నారు.



ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని ఆశీర్వదిస్తున్న వేద పండితుడు

## గోలిలింగాలలో బోరు మోటరు ప్రారంభం

నాగిరెడ్డిపేట, జూన్ 8: మండలంలోని గోలిలింగాల గ్రామ శ్మశాన వాటిక వద్ద ఏర్పాటు చేసిన బోరు మోటరును యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సురేందర్ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్మశాన వాటిక వద్ద నీటి వసతి లేని విషయాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు వివరించామన్నారు. దీంతో ఆయన స్పందించి రూ.లక్షా80వేలు మంజూరు చేయించారని తెలిపారు. వాటితో బోరుబావి తవ్వించి, మోటరును బిగించామని తెలిపారు.



బోరుమోటరును ప్రారంభిస్తున్న నాయకులు

## జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

నాగిరెడ్డిపేట, జూన్ 8: జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బొల్లారం గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోరబోయిన హరీశ్(24) అదే గ్రామానికి చెందిన అనితను ప్రేమించి ఆరు నెలల కిత్రం వివాహం చేసుకున్నాడు. అనంతరం వారు హైదరాబాద్‌కు వెళ్లి ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం కల్యాణలక్ష్మి డబ్బుల కోసం స్వగ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో అనిత అన్న, కుటుంబ సభ్యులు హరీశ్‌కు ఫోన్ చేసి తమ చెల్లిని బాగాచూసుకోవాలని చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన అతడు శుక్రవారం సాయంత్రం తండ్రి నాగయ్యకు ఫోన్ చేసి మీరు జాగ్రత్తగా ఉండాలని చెప్పి ఫోన్ కట్ చేశాడు. అనుమానం వచ్చిన అతడు చుట్టుపక్కల వెతకగా.. గ్రామ శివారులోని తమ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

### చేపలు పట్టేందుకు వెళ్లి..

## చెరువులో పడి వ్యక్తి మృతి

భిక్కనూరు, జూన్ 8: చేపలు పట్టడానికి వెళ్లి.. చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన బస్వాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగాధరి స్వామి(46) గ్రామ శివారులోని పటేల్ చెరువులో శనివారం చేపలు పట్టేందుకు దిగాడు. చేపల వల కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## గోవులను సంరక్షించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బజరంగ్‌దళ్ నాయకులు

ఎల్లారెడ్డి, జూన్ 8: ఎల్లారెడ్డి ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న గోవులను రక్షించాలని కోరుతూ బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేశ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వినోద్, భరత్, తులసీదాస్, రాహుల్, నాగసాయి, చరణ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టు ఏర్పాటు

నాగిరెడ్డిపేట, జూన్ 8: నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఎదుట బోధన్ – హైదరాబాద్ రహదారిపై శనివారం చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్పీ సింధుశర్మ ఆదేశాల మేరకు బక్రీద్ సందర్భంగా గోవులను తరలించకుండా చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపడుతామన్నారు. ఎవరైనా గోవులను అక్రమంగా తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## రేపటి నుంచి ఇంటర్ సెకండియర్ తరగతులు

రామారెడ్డి, జూన్ 8: రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సోమవారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం అవుతాయని కాలేజీ ప్రిన్సిపాల్ మధు శ్రీవాత్సవ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌కు గైర్హాజరైన వారికి సోమవారం ఉదయం పది గంటలకు ప్రాక్టికల్స్ ఉంటాయని, విద్యార్థులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

## ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 8: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రముఖ వ్యాపారి కంచర్ల బాల్‌కిషన్‌ను ఎల్లారెడ్డి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఆయనకు పూలమాల వేసి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పాత్రికేయులు రాజ్‌కుమార్, ఎల్లారెడ్డి ప్రెస్‌క్లబ్ సభ్యులు బొజ్జ శివకుమార్, రాజేందర్‌నాథ్, సిద్ధూగౌడ్, ప్రశాంత్‌గౌడ్, సంగ్రామ్, పృథ్వీరాజ్, మహేశ్, రామప్ప, పవార్ సంతోష్, పట్టెం ప్రసాద్, ఆకుల వెంకట్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఐకేపీ కార్యాలయంలో ఆడిట్

బీబీపేట్, జూన్ 8: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండలంలోని 28 మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంతర్గత ఆడిట్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ అధికారి సుధాకర్ మాట్లాడుతూ.. వీవోఏలు, గ్రామ సంఘాలు ఆదాయాన్ని పెంచుకొనేందుకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం బాలపోచయ్య, డీఎంజీ రాంచంద్రాగౌడ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్రవంతి, సీసీలు శ్రీనివాస్, రాజేశ్వర్‌రెడ్డి, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో చిరుజల్లులు

బాన్సువాడ, జూన్ 8: బాన్సువాడలో శనివారం సాయంత్రం చిరుజల్లుల కురిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్రంగా ఎండ ఉండగా.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి చిరుజల్లులు కురియడంతో రైతులు సంతోషం వ్యక్తంచేశారు. మృగశిర కార్తె రోజు చిరు జల్లులు కురియడంతో ఇకనుంచి భారీ వర్షాలు ఉంటాయని అన్నదాతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా జడ్పీ మాజీ చైర్మన్ బర్త్‌డే

నిజాంసాగర్, జూన్ 8: జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు జన్మదిన వేడుకలను శనివారం మహ్మద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు కలిసి రాజు నివాసంలో కేక్ కట్ చేసి పటాకులు కాల్చారు. అనంతరం కేక్‌ను ఒకరికొకరు తినిపించుకొని సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌లో 511 కేసుల పరిష్కారం



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ హారిక

ఎల్లారెడ్డి, జూన్ 8: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 511 కేసులను పరిష్కరించినట్లు మెజిస్ట్రేట్ హారిక తెలిపారు. ఇరువర్గాల వారి సహకారంతో కేసులను పరిష్కరించామని చెప్పారు. పరిష్కరించిన కేసుల్లో క్రిమినల్ 47, ఆస్తి తగాదా ఒకటి, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన 28, పిటీ కేసులు 407, సైబర్ నేరాలు 29 ఉన్నాయని తెలిపారు.

## బాన్సువాడలో 267 కేసులు..



బాన్సువాడలో మాట్లాడుతున్న భార్గవి

బాన్సువాడ, జూన్ 8: బాన్సువాడ మున్సిఫ్ కోర్టు ఆవరణలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 267 కేసులను పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి కుమారి భార్గవి తెలిపారు. కేసులు త్వరగా పరిష్కారం కావడంతో కక్షిదారులు సంతోషం వ్యక్తంచేశారు. న్యాయవాదులు లక్ష్మీనారాయణ మూర్తి, ఖలీల్, కోర్టు సిబ్బంది శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలోని మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

# ఘనంగా మృగశిరకార్తె

**చేపలు, మామిడి పండ్లకు భలే గిరాకీ.. ధర పెంచి విక్రయించిన వ్యాపారులు**



ఇసన్నపల్లిలో జాలరుల వలకు చిక్కిన బంగారుతీగ



గాంధారిలో చేపలను విక్రయిస్తున్న వ్యాపారులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూన్ 8: మృగశిరకార్తెను జిల్లా వ్యాప్తంగా ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆనవాయితీ ప్రకారం మామిడిపండ్ల పానకం చేసుకోవడంతోపాటు చేపల వంటకం చేసుకున్నారు. మృగశిర కార్తె రోజు చేపలు తింటే రోగాలు తగ్గుతాయని, ఆరోగ్యంగా ఉంటామని ప్రజల విశ్వాసం. పండుగను పురస్కరించుకొని వ్యాపారులు మామిడిపండ్లు, చేపల ధరలను పెంచి విక్రయించారు. మామూలు రోజుల్లో 50, 60 రూపాయలు కిలో ఉన్న మామిడి పండ్లు పండుగ సందర్భంగా వంద నుంచి 120 రూపాయల వరకు పెంచారు. చేపల ధరలను కూడా రకాన్ని బట్టి కిలోకు 50 నుంచి 70 రూపాయల వరకు పెంచి విక్రయించారు. పండుగ సందర్భంగా రామారెడ్డి మండలంలోని ఇసన్నపల్లి చెరువులో జాలర్లు చేపలను పట్టారు. వలకు ఐదు కిలోల బంగారు తీగ చేప చిక్కింది. చేపతో పలువురు సెల్ఫీ దిగారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్మికులు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 8: ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిబాబా డిమాండ్ చేశారు. ఈ మేరకు లింగంపేట మండలంలో శనివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల ఐలన్న పిలుపు మేరకు 10వతేదీ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ రంగ కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి సాయన్న, నాయకులు మొగులాలి, బాలయ్య, విజయ్, రామారావు, శివ, ఇమామ్, కొండయ్య, రవి, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిపథ్ వీరుడికి సన్మానం



సాయికుమార్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ కులస్తులు

బిచ్కుంద, జూన్ 8: మండల కేంద్రానికి చెందిన లంకల విఠాబాయి – లక్ష్మణ్ దంపతుల కుమారుడు సాయికుమార్ అగ్నిపథ్ శిక్షణను పూర్తి చేశాడు. ఆయన స్వగ్రామానికి రావడంతో వాల్మీకీ ఆలయం వద్ద ముదిరాజ్ సంఘ సభ్యులు శనివారం ఘన స్వాగతం పలికి శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సాయిరాం, కప్ప గణేశ్, బసన్‌బోయి హన్మాండ్లు, బశెట్టి, తౌటి సాయిలు, పిట్ల సాయికుమార్, సచిన్, నాందేవ్, బంటు శ్రీనివాస్, సిద్రాం, ఉప్పరి కట్టప్ప తదితరులు పాల్గొన్నారు.


NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PLOTS for SALE
Peram
దుండిగల్ ORR ప్రక్కన HMDA, RERA Approval కలిగి ఉన్న ఇల్లు కట్టుకోవడానికి అనువైన లేఅవుట్ ప్లాట్లు అమ్మకానికి కలవు.
బ్యాంక్ లోన్ సదుపాయం కలదు.
గమనిక: ఈ లేఅవుట్ చుట్టుప్రక్కల గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్, విల్లాస్ ఉన్నవి. మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
Trendz apartments, Gachhibowli
9849 162 168

CHANGE OF NAME
★ I, KURME RAVI S/o. PEDDA RAJANNA KURME R/o.H.No.4-9/4, Bodepalle, Balkonda, Nizamabad now changed Name/Surname as MEKALA RAVI
NTZ-324893

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన



అడ్విలింగాల్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



డోంగ్లీలో..

**కొనసాగుతున్న బడిబాట**

ఎల్లారెడ్డి రూరల్/ డోంగ్లీ/ బిచ్కుంద, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా బడిబాట కార్యక్రమం శనివారం కూడా కొనసాగింది. ఎల్లారెడ్డి మండలం అడ్విలింగాల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కైల విజయ్, కిషన్ తదితరులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. చిన్నారులను సర్కారు బడికి పంపించాలని కోరారు.

డోంగ్లీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీరామ్ తదితరులు ఇంటింటికీ తిరుగుతూ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బిచ్కుంద ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం సర్కారు బడుల్లో కల్పిస్తున్న వసతులను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం కిశోర్ ఉద్యోగ విరమణ చేయగా.. దత్తాగౌడ్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా అతడికి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గాండ్ల గంగాధర్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామోజీరావుకు ఘన నివాళి

ఎల్లారెడ్డి/ నస్రుల్లాబాద్/ నాగిరెడ్డిపేట, జూన్ 8: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు జిల్లావ్యాప్తంగా పలువురు శనివారం నివాళులర్పించారు. ఈనాడు గ్రూపు అధిపతి చెరుకూరి రామోజీరావు మృతి పట్ల ఎల్లారెడ్డి పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో పలువురు విలేకరులు నివాళులర్పించారు. బీర్కూర్‌లో కమ్మ సంఘం ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి, పత్రికా, పారిశ్రామిక రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో రామోజీరావుకు మృతికి సంతాపంగా ఆయా పార్టీల నాయకులు, పాత్రికేయులు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.



బీర్కూర్‌లో రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమ్మ సంఘం నాయకులు